# రాబందులు

## ఆదిత్య

ఊరికి అవతల మైదానం. విస్పారమైన ఆ మైదానమే కాదు. ఆ ప్రాంతమంతా ఆ ప్రదేశమంతా అనావృష్టి మూలంగా ఎండి బీటలు వారింది అక్కడి మనుష్యుల గుండెల లాగానే.

క్షామదేవత బిగి కౌగిలిలో ఒదిగిపోయి ఉక్కిరి బిక్కిరవుతున్న ప్రాంతం అది. నవీన కాల భారతంలోని పెక్కుచోట్ల అశేష ప్రజానీకం కరవు రక్కసి కోరల్లో నలిగిపోతుం టారన్న వాస్తవాన్ని ప్రతిబింబిస్తున్నది. మైదానానికి మూలగా శ్మశానం. సుడిగాలి వీస్తున్నప్పుడల్లా అందులోని బూడిద అణ్వస్త్రవిస్ఫోటన ధూమంలాగా ఎగిరి ఆకాశాన్ని ఆవరించుకు పోతున్నది. బీదవాళ్ళ జీవితాలకు ప్రతీకలుగా అక్కడక్కడ ఎండి మోడువారిన చెట్లు.

మృత్యువు విజయగర్వ చిహ్నంగా కలకలలాడుతున్నది శ్మశానం.

నక్కలు శవాలను పీక్కుతింటున్న నక్కలు. ఎండిన మనుషుల పీనుగులను తింటూ తమ డొక్కలు నింపుకునేందుకు విశ్వ ప్రయత్నం చేస్తున్నాయి. ఊళలు వేస్తున్నాయి.

ఆ మైదానం అంతం వాగు ఒడ్డు. ఒక్క నీటి చుక్కకూడా లేకుండా ఎండిన వాగు అది. ఏళ్ళేండ్లకుకూడా తడి లేకుండా ఎండిన కష్టజీవి హృదయంలాగా.

వాగులోని ఇసుక సూర్యుడు కక్కుతున్న నిప్పుల సెగకు వేడెక్కి వుంది. వేడి సెగలు అలల్లాగా పరుగులు తీస్తున్నాయి. దూరాన వాగులో అక్కడక్కడ నీటిగుంటల్లాగా ఉన్నాయి. వాటిల్లో అవతలి ఒడ్డున ఉన్న తాడిచెట్ల నీడలు ప్రతిబింబిస్తున్నాయి. భ్రమ! అవి ఎండమావులు! ఓట్లు దోచేందుకు రాజకీయ నాయకులు సామాన్య ప్రజానీకాన్ని ఆకర్షించేందుకు చేసే తుక్కు వాగ్దానాలవంటి మిథ్యా రూపాలు! ఆ ఎండిన వాగులో నీటికోసం కనీసం అరమైలులోతు తవ్వాల్సి వుంటుంది కాబోలు!

ఆ మైదానంలో—

ఒక శవం-ఎద్దుశవం-విర్జీవంగా. విశ్చలంగా పడివుంది. మహిషాసురుడి మహిషం లాగా.

ఈ లోకపు బంధాల్ని వీడిపోయినఆ ప్రాణి భౌతికకాయాని)—

రాబందులు రాక్షసుల్లాంటి రాబందులు నలుపు బూడిద కలిపిన రంగులతో. ఖడ్గాల్లాంటి ముక్కులతో. బాకుల్లాంటి నఖాలతో. తీక్షణమైన కళ్ళతో. అటూ ఇటూ చూస్తూ చిన్నగా చప్పుడు చేస్తూ. మామూలు మనిషిని ధనస్వామ్యం క్రూరంగా పీక్కుతింటున్నట్టుగా—

పీక్కు తింటున్నాయి. నిర్భయంగా నిర్దాక్షిణ్యంగా ఘోరంగా సంతోషంగా. ప్రీతిగా ఆవురావురుమంటూ.

అవును తినడంలో తప్పులేదు. అదివాటికి ఆహారం. సృష్టిలోని ప్రతి జీవి ఏదో ఒక వేరే జీవాన్ని తప్పక తినాలి. ఈగలు బల్లులకు. బల్లులు పిల్లులకు. పిల్లులు కుక్కలకు. పురుగులు కప్పలకు. కప్పలు పాములకు. పాములు గ్రద్దలకు. ఇలా.... ప్రతి ప్రాణీ ఏవో ఒక వేరే క్రియేచర్‌కు ఆహారం అది సృష్టి ధర్మం ఇంకా నయం ఆ రాబందులు తింటున్నది ప్రాణమున్న ఎద్దునుకాదుశవాన్నిచచ్చిన దాన్ని ప్రాణంతో ఉన్నదాన్ని తినేశక్తి వాటికి లేదు. ఒక్కొక్క ప్రాణి శక్తికి కొన్ని పరిమితులు సృష్టిలో.

ఆఎద్దు శవంకు. డొక్కదగ్గర ఒక గజం పరకు చర్మం వలచబడి వుంది. ఎర్రగా మాంసం తెల్లగా ఎముకలు కనిపిస్తున్నవి. దాని ఉరఃపంజరంలో ఆ వలచేబడ్డ తోలు కాస్తా ఎండినట్టయి కుచించుకుపోయి వ్రేలాడుతున్నది క్రిందికి.

మొత్తం రాబందులు పదిదాకా వుంటాయి ఎర్రటి మాంసాన్ని కసుక్కున కొరికి తనివి తీరా తింటున్నాయి. పైన ఆకాశంలో గద్దలు ఆ చచ్చిన ఎద్దుకేసి ఆశగా చూస్తూ వలయాకారంగా ఎగురుతున్నాయి. దూరాన కాకులు చెట్లమీదినుండి కావుకావుమని అరుస్తున్నాయి. మూడు నాలుగు గజాల దూరాన కొన్ని కుక్కలు ఊరకుక్కలు పిచ్చికుక్కలు బిక్కుబిక్కుమని ఎద్దును చూస్తున్నాయి. మూతులు నాక్కుంటున్నాయి. మధ్యమధ్య చిన్నగా మొరుగుతున్నాయి కొన్ని.

❊ ❊ ❊

ఊరు దాదాపు నిశ్శబ్దంగా వుంది నడ్డుమణిగి సూర్యుడు నడినెత్తిన చిందులుతొక్కుతున్నాడు. రోహిణీ కార్తి వడగాడ్పులకు చెట్లు బాధగా. భారంగా తలలూపుతున్నాయి.

ఎక్కడో ఎవరో గొడ్లను అదిలిస్తున్న చప్పుడు. గొల్లవాండ్ల ఇళ్ళల్లో కుమ్మరివీధిలో పిల్లవాడు ఏడుస్తున్న చప్పుడు.

దుర్గమ్మగుడిలో అరుగుమీద. ఊరిపశువులు కొడుకు ఎనిమిదేళ్ళవాడు కూర్చుని చల్లగాపిల్లన గ్రోవి వాయిస్తున్నాడు. ఒకావిడఎవరో,రెండు రోజులక్రితం తన ఇంట్లో జరిగిన చావును తలచుకొని ఏడుస్తూ. పెద్దగా శోకాలు పెడుతున్నది. చిన్న రైతుల కొడుకులు పిల్లలు వేప చెట్టుక్రింద మామిడి టెంకలతో ఆటాడుకుంటున్నారు. వాళ్లు ఇంకా మొగ్గలు. కష్టం ఎరుగని వాళ్ళు. తిండి సమస్య తెలియనివాళ్ళు. లోకంలో ఏమేమి ఘోరాలు. ఆకలి చావులు జరుగుతున్నాయో ఎరుగనివాళ్లు. ప్రకృతి విలయతాండవం చూడనివాళ్లు. మానవత్వపు అంతర్ధానం తెలుసుకోలేనివాళ్లు. అమాయకులు అజ్ఞానులు.

గ్రామ మునసబుగారు తన యింట్లో ఊయల మంచంమీద పడుకుని భుక్తాయాసం తీర్చుకుంటున్నాడు. ఉక్కపోస్తుంటే కండువాతో గాలి విసురుకుంటున్నాడు. ఆయన సతీమణి క్రింద చాపమీద కూర్చుని రామాయణం చదువుకుంటున్నది నిశ్చింతగా.

సాహుకారు కైలాసం దుకాణంలో కూర్చుని బొర్ర నిమురుకుంటూ డబ్బులు లెక్కపెట్టుకుంటున్నాడు. వేడి. ఉక్కపోత భరించలేక పాలేరును కేకలేస్తున్నాడు వరిగడ్డి తడిపి ఇంటిమీద వేయమని.

పాలె శంకరయ్య. మగ్గంమీద చేస్తున్న పని ఆపి. చెంగావి పంచెతో చెమట తుడుచుకొని భార్య చేతుల్లోంచి అంబలి గిన్నె అందుకుంటున్నాడు.

ఇలా రకరకాల వ్యాపకాలవాళ్ళు రకరకాల తంటాలు రకరకాల బాధలు.

ఊరిలో మూలగా కొన్ని గుడిసెలు తాటాకుల గుడిసెలు మాల మాదిగల హరిజనుల గుడిసెలు. కంపు వాసనతో మురికిగా వున్నవి వానాకాలంలో అక్కడి ఈగలు దోమలు ఇతర క్రిములంత అదృష్ట ప్రాణులు సృష్టిలో మరేప్రాణి కాదు. వాటికి అమితసౌఖ్యంగా సౌకర్యంగా వుంటుంది. స్వర్గంలో వున్న

ట్టుగా.

ఉండుండి "ఝుయ్" మని ముడిగాలి వీచింది. మాదిగ జగ్గడి గుడిసె మీది కప్పు లోంచి తాటాకులు ఎగిరిపోయిఅల్లంతమూరాన పడ్డాయి. అరుగుమీద కూర్చుని మోకాళ్ళ మధ్య తలపెట్టుకున్న జగ్గడు ఆ చప్పుడు విని లేచివెళ్ళి వాటిని యథాస్థానంలో తిరిగి కప్పాడు. తలపైకెత్తి ఆకాశంలోని పొద్దునుచూశాడు ఇంట్లోకి



నడిచి పొయ్యిమీది కుండదించి దానిమూతతీసి పిల్లల్ని పిలిచాడు. పిల్లలు, అయిదుగురు బిలబిలమంటూ తండ్రి దగ్గరకెళ్లారు. ఆశ తండ్రి చేతిలోని కుండను చూస్తూ నిలబడ్డారు ప్రొద్దుటినుండి వాళ్ళకు కడుపులో ఏమీలేదు. చాలా రోజులుగా వాళ్ళకు సరిగ్గా కడుపు నిండ లేదు. ఏరోజుకూడా—

జగ్గడు అచిన్న మట్టికుండలో చేయిపెట్టి, అందులోని ఉడికించిన మొక్కజొన్న గింజలను పిల్లలకు తలా రెండు పిడికిళ్ళు పోశాడు వాళ్ళ కళ్ళు మెరిసినయ్. మూలకు కూర్చుని తినడానికుపక్రమించారు.

కుండలో మళ్ళీ చెయ్యిపెట్టాడు జగ్గడు. ఇంకా రెండు పిడికిళ్ళు మాత్రమే వున్నాయి మొక్కజొన్న గింజలు.

మూలకు, గోడకన్నం దగ్గర చాపమీద పడివున్న భార్యకేసి నడిచాడు.

అస్థి పంజరంలా, అగ్గిపుల్లలా పీలీలాగా వున్న చాపమీది ఆకారం జగ్గడి పెళ్ళాం లచ్చి దాన్ని అంటిపెట్టుకుని పెద్దసైజు పందికొక్కులా, కోతిలా కర్చుకుని వున్నది చంటిది. లచ్చి మునుపటిలా కష్టం చేయలేకపోవడమే కాదు. లేచి కూర్చునేందుకు కూడా శక్తిలేని బలహీనురాలు. ఇప్పుడు పీనుగలాగావున్నది.

చమటతో చాప అంతా తడిసింది. జగ్గడు గాలి విసురుతూ "లచ్చీ" అని పిలిచాడు.

లచ్చి కళ్ళు విప్పింది. ఒత్తిగిల్లింది. ప్రక్కకు దొర్లించి చంటిదాని నోటోంచి రొమ్ము జారిపోయింది. కేరుకేరు మంది కర్ణకఠోరంగా నిమిషం తర్వాత ఏడుపు ఆగిపోయింది. ఏడ్చే సత్తువకూడా లేదు చంటిదానికి. ఇంతవరకూ రొమ్ము నోట్లో వుంచుకుని చీకుతున్నప్పటికీ దాని కందినవిగుక్కెడు పాలు అవుతాయో కావో.

లచ్చిని మెల్లగా జబ్బలక్రింద చేతులుపెట్టి



ధరేంద్ర రెండో భార్యగా నేను హాయిగా గడుపుతున్నాను. నా భర్త మొదటి భార్య వారి కుటుంబ సభులు నన్ను కొంతవరకు ద్వేషించినా నా భర్త మాత్రం ఇప్పటికీ నన్ను గాఢంగా ప్రేమిస్తున్నారు.

—హేమామాలిని

లేవనెత్తి కూర్చోపెట్టాడు. మక్కగింజలు పిడికిట పట్టి తినిపించబోయాడు.

"పిల్లగాండ్లు తిన్నారా" అడిగింది లచ్చి నీరసంగా.

"ఆఁ!"

"మరి నువ్వు?"

"తిన్నా అబద్ధమాడాడు జగ్గడు. తనుతింటే పిళ్ళకు? మొత్తం గింజలు రెండు దోసిళ్ళే అవుతాయి. ఇక తాను అందులో భాగస్వామి అయితే వీళ్ళకు ఏం సరిపోతుంది? అందులో లచ్చి పిల్లతల్లి. చంటిదానికోసమయినా కాస్త కడుపులో పడేసుకోవాలి.

ఎన్నాళ్ళీ కరువు? దుర్భరమైన ఆకలిబాధ? అందరూ వున్నవాళ్ళు ఎవరికి వారే? అయ్యో పాపం తిని పిడికెడు గింజలు ఎవరూ పెట్టడం లేదు. ఏమన్నా పని చేద్దామన్నా పనిలేదు. ఏం పని? చేసినా మట్టితప్ప ఇంకేంచొరకదు

ఇక రేపటినుండి ఆకులు అలాలు తింటే గాని గడవదు. అదే గతి. మనుషుల్ని మనుషులు తినే కాలం ఇంకెంతో దూరం లేనట్టుంది.

పిల్లగాండ్ల కడుపులు నింపలేదన్న బాధ వున్నా చంటిది? తోలుబొమ్మలాంటి చంటిదాన్ని నిర్వేదంగా చూస్తూ అపిడికెడుగింజల్ని నమిలింది లచ్చి.

"బిడ్డా, ఇక తినేందుకేం లేదు. చింత గింజలు ఏరుకరాండ్రి. అట్లనే ఓలెడు చింత చిగురుకోసుకరాండ్రి. అట్లనే మాపటికి తిందాం" చెప్పాడు జగ్గడు పిల్లలనుద్దేశించి

పిల్లలు బయలుదేరారు నీళ్ళుతాగి

భార్యకు ఉక్కపోయకుండా కొద్దిసేపు తాటాకు విసనకర్రతో గాలి విసిరి భారంగా లేచాడు అక్కడినుండి జగ్గడు. మోచీ ఆతని దృష్టి చూరుక్రిందవున్న సామానుమీదపడింది


చెప్పులుకుట్టే ఆ సామానును ఆప్యాయంగా తడిమాడు. చాలారోజులుగా పనిలేక మూలన పడివున్నందున అవి తుప్పుపట్టిపోయి గరకుగా తగిలాయి. గూటం, ఆరె, దబ్బనం అన్నీ తుప్పుపట్టినై. మేకులు, రివిట్లు అన్నీ అతుక్కుపోయినాయి ఒకదానికొకటి. తోళ్ళు తడిపే నీళ్ళ కుండలో నీళ్లు ఎండిపోయి చార ఏర్పడి కంపుకొడుతున్నది అసహ్యంగా.

చెప్పులుకుట్టడం తరతరాలుగా తాత ముత్తాతలనుండి వస్తున్న కులవృత్తి తమకు? తన ముత్తాత పూర్వం, మహారాజులకు, సంస్థానాధీశులకు, జమీందారులకు చెప్పులు కుట్టేవాడు. ఆ చెప్పులోని నాణ్యతకూ, పని తనానికీ ముగ్ధులయి సంతోషించేవారట.

కాని ఇప్పుడా వృత్తికి తావు లేకుండా పోయింది. సామాను మూలకు పడింది తోలు లేకపోవడం వల్ల ఇప్పుడు చమడా దొరికితే చెప్పులు కుట్టి, బస్తీలో అమ్మితే కాస్తో, కూస్తో దొరక్కపోదూ కాని ఇప్పుడు చర్మంఎక్కడ దొరుకుతుంది?

జగ్గడు కాస్త మనశ్శాంతి కోసం చేసే ఒకేఒక కాలక్షేపపు పని - అదమరచి డప్పు వాయించుకోవడం. బాధలు మర్చిపోవడానికి ఆనందం, మనశ్శాంతి కోసం. డప్పును వాయిస్తూ తన్మయుడై పోతాడు. ఈ లోకాన్ని మరచిపోతాడు. "టకా టకా" అదే పనిగా వాయిస్తున్నాడు. అ వాయించడంలో ఒక లయవుంది. ఆ లయ - వాయించడంలో - "ఎల్లమ్మ దేవత" వాళ్ళ కుల దైవం-ఉద్దేశించిన ప్రార్థన వుంటుంది. ఏ బాధ అయినా ఏ వుపద్రవమయినా "ఎల్లమ్మ దేవతను" కొలవడం వాడి తాతలనుండివస్తున్న ఆచారం ఆ డప్పు వాయించడం, ఆలయవాడికి వాళ్ళ తాత నేర్పాడు.

మెల్లగా, చిలక్కొయ్యకు తగిలించివున్న డప్పును అందుకున్నాడు. గూట్లోంచి దాన్ని






పరుని నీ ముందు దిట్టెడు వాడు నిన్ను
నొరుని ముందట దిటక యుండబోడు —కవిరాజు త్రిపురనేని

వాయించేకోల. పుల్ల తీసుకున్నాడు. డప్పును ఛాతీ కానించుకుని, పొజిషన్‌లో పట్టుకుని ఎడమ చేత్తో పుల్ల, కుడి చేత్తో కోలతో "టక టక"మని వాయించాడు డప్పును - హాయిగా కళ్ళు మూసుకుని "ఎల్లమ్మ"ను ప్రార్థిస్తూ తన్మయంగా, అరుగుమీద కూర్చుని.

డప్పు చప్పుడులో ఏదో తేడా కన్పించింది. మునుపటి శ్రావ్యత లేదు వాద్యంలో కొట్టడం ఆపు డప్పుడు చూశాడు. దాని తోలుమధ్యగా పగిలిపోయి వున్నది. శబ్దం సరిగ్గా రావడం లేదు అందుకే-

స్ఫురణ వచ్చింది జగ్గడికి. అది ఎన్నడో పగిలి పోయిందనే సంగతి ఇప్పుడు జ్ఞాపకం వచ్చింది. అవాడు. ఓసారి ఎవరి చావుకో వెళ్ళాడు. కులవృత్తి ప్రకారం చావు డప్పు వాయించడానికి. ఆనందంగా కల్లు తాగిన హుషారులో చురుకుగా, హాయిగావాయించాడు. అలా వాయించిన కొంత సేపటికే డప్పుపగిలి పోయింది ఫట్‌మని. ఆ చచ్చిన వాడి తాలూకు వాళ్ళు తనను తిట్టిపోశారు. మధ్యలో డప్పు వాద్యం ఆగిపోవడం అపశకునమంటూ ఆ తర్వాత ఇంక రెండు మూడుసార్లు చావులకు కబురు వచ్చింది. కాని డప్పులేదు. ఎలా వెళ్తాడు? అలా చాలాసార్లు గిరాకీపోయింది. డప్పువాయించినందుకు మంచిగానే ముట్టచెప్పే వాళ్ళు. కాని డప్పు ఎప్పుడు పగిలిందో ఇక దురదృష్టం. ఎంతో బాధ మొదలయింది.

ఇప్పుడు దానికి వేరే తోలు వేద్దామన్నా. చర్మంలేదు. సంపాయించడం మామూలు మాటకాదు.

ఆశ నిరాశయింది జగ్గడికి. డప్పు యధా స్థానంలో పెట్టాడు.

చావులు బాగానే అవుతున్నాయ్. డప్పు వాయించేట్టు వుంటే - వాయించి పిడికెడు గింజలు సంపాదించవచ్చు. మరి దాన్ని బాగు చేయాలి. అందుకు తోలు కావాలి.

చంటిది వున్నట్టుండి కేర్‌మంది. గుక్క పెట్టి ఏడ్చింది. లచ్చి విశ్రాంతగా కళ్ళు మూసుకుంది. పాల వాసనకు లచ్చి రొమ్ముకు అన్నీ చీమలు. అలానే అవి చంటి దాని మూతికీ పాకినై. అవీ ప్రాణులే. వాటికీ ఆకలే మనుషులకు లాగానే చీమలకూ ఆకలి! ఆహారం! చంటిదాన్ని కుట్టుకున్నాయి. జగ్గడు పరుగున వెళ్ళి చీమలు దులిపాడు.

ఆకలి! ఆహారం!!

ఆలోచిస్తున్నాడు జగ్గడు.

నిన్నటి సంఘటన వాడికి గుర్తుకొచ్చింది.

నిన్న తను, కాపిని తిండిగింజలకోసం. అర్థించేందుకు కాపు పెద్ద రామయ్య యింటికి వెళ్ళాడు. కాస్తా గంజికూడా వుంటే పోయిస్తా డని ఆశ. అతను ఊరిలోని రైతులందరి కంటే వున్నవాడు. ఉచ్ఛస్థితిలో వున్నాడు.


ఆ సమయంలో ఆయన తన ప్రియపాత్రు లైన రెండు ఎద్దులు రంగ-మంగల్లో ఒక టయిన రంగకు వైద్యం చేయిస్తున్నాడు. గొడ్ల వ్యాధులగురించి తెలిసిన పలుగురైదు గురు పెద్ద మనుషులు, ఆ ఎద్దును తాళ్ళతో కట్టి బిగించిపట్టి, ఏవేవో మందులు పసరులు దాని నోట్లోకుక్కుతున్నారు. ఇనుప కడ్డీలను ఎర్రగా కాల్చి, కీళ్ళరిగి నరాలమీద వాతలు పెడు తున్నారు. రామయ్య ముఖం కాంతి హీనంగా వుంది. తెల్లగా- ఆందోళన పడుతున్నాడు. "సర్కారీ పశువుల డాక్టరు మందులకు ఏమీ నయం కాలేదు. రంగ ఎలాగైనా బాగుపడాలి. ఇదిలేకపోతే ప్రాణం పోయినట్టే! మంచిగా వైద్యం చేయండి ఎంత ఖర్చయినా సరే!" అంటూ పెద్ద మనుషులకు పురమాయిస్తున్నాడు కళ్ళ నీళ్ళు పెట్టుకుంటున్నాడు. ప్రేమగా ఎద్దును నిమురుతున్నాడు. ఆ వైద్యులకు దాని రోగం అంతుబట్టినట్టులేదు. చూస్తుండగానే. దాని కళ్ళు పచ్చబడినై. దీర్ఘంగా, బలవంతం గా శ్వాస తీసుకోనారంభించింది. వైద్యులు త్వరత్వరగా తమ ప్రయత్నాలు తాము చేస్తు న్నారు. తనుకూడా వారికి సహాయం చేస్తూ ఎద్దును పరీక్షగా చూశాడు. ఆ రోగం తనకు తెలుసు. ఇక అది ఎంతోసేపు బ్రతకదు. అప్పటికే కొన ప్రాణంతో కొట్టుమిట్టాడు తున్నది. వైద్యులు పెదవి విరిచి ప్రక్కకి తొలగిపోయారు. వెళ్ళిపోయారు మామూళ్ళు తీసుకొని. చనిపోబోతున్న ఆ ఎద్దును చూస్తూంటే తనకు కాస్త ఆశ పుట్టింది. వినయంగా చేతులు జోడించి రామయ్యతో అన్నాడు.

"అయ్యా నీ బాంచను దొరా! ఈ ఎద్దు ఇంకో అరగంటకన్న ఎక్కువసేపు బ్రతకదు. ఈ రోగం మహమ్మారిది. నిమ్మషాలమీద పానం పోద్ది. ఇది ఎట్టాగూ సచ్చిపోతది. సచ్చినాక దీన్ని అవల పారేస్తారు వ్యర్థంగా. జర్రదాన్ని పాపకముందే మాకిప్పిస్తే, మీ పున్యెన. మీపేరు సెప్పుకుని. మా మాదిగోళ్ళ మంతాకోమక తింటం! దయుంచండ్రి దొరా. ఆకలికి సచ్చిపోతాన్నం. పోరగండ్లకు. పిల్లి తల్లికి తినేందుకేం లేదు!"

రామయ్యకు ఆ మాటలు మహాపాపంగ తోచినై. కోపంతో ముఖం ఎర్రబడింది. భయంకరంగా గర్జించాడు.

"ఏం రా చండాలపు లంజాకొడకా! మాదిగ ముండా కొడకా-ఎంత పాపం పుట్టుక పుట్టినవ్‌రా! ఇది నా "రంగ" రా. నా అదృష్ట దేవతరా. నా ప్రాణం! ఇన్నాళ్ళు సేవజేసింది. దాని కోతకంపుతావా రాక్షస ముండాకొడకా! చీల్చిపారేస్తా! ఇలాంటి పాపం ముండా కొడు కులు కనుకనే మీరు ఈ గతిలో వున్నారు. పుట్టగతులుండవు మీకు. పో ఇక్కణ్ణించి!"

> ## భూత వైద్యం:
>
> "కాహిరా"లో ఓడాక్టరు చచ్చి 13 సం॥లు అయినా రోగాలకు (ముఖ్యంగా) స్త్రీపేషంట్లకు చికిత్స చేస్తాడట. ఏదైనా జబ్బుతో రోగి ఆ స్వర్గీయ డాక్టర్ గదిలోకి వెళ్ళి ఓ కాగితంమీద తన రోగం గురించి వివరంగా రాసి బైటకు రావాలట. ఆ తర్వాత ఆ డాక్టర్ ప్రేతాత్మ వచ్చి ఆ రోగి వ్యాధికి తగిన మందును రాసి పెడుతుందని అక్కడి ప్రజలు చెబుతారు.
>
> ఎస్. నరసింహమూర్తి (రేణుశ్రీ)






ఉన్న ఊరూ విడిచి ఉండనే లేము
కన్నతల్లిని విడిచి ఘడి యుండలేము —జానపద వాణి

అంటూ బాది బయటకు గెంటాడు. తనకు ఏడ్పు వచ్చింది. ఏడ్చాడు. జంతువులంటే అంత మమకారం ఎందుకో? చచ్చినాక వ్యర్థంగా పారేయడం పవిత్రవస్తువు లాగా. ఎందుకో వాడికర్థం కాలేదు. చాలా సేపు ఏడ్చాడు. ఊరి వాళ్ళందరిని పొడిచి పారెయ్యాలనిపించింది. నమిలి మింగేయా లనిపించింది. అగ్గిలోవేసి వాళ్ళందరూ మిడతల్లాగా హాహాకారాలుచేస్తూమాడిపోతుంటే చూసి ఆనందించాలనిపించింది. కాని తనేం చేయగలడు? ఏమీ చేయలేడు.

ఆలోచిస్తున్నాడు జగ్గడు. కడుపులో ఆకలి బాధ. నీరసం ఏదో నిశ్చయానికి వచ్చాడు. అటకమీది కత్తిని తీశాడు. అది గొడ్లను కోసేందుకు ఉపయోగించే కత్తి. తుప్పు దులి పాడు. బండమీద రాకిపదను పెట్టాడు. కడుపు నిండా నీళ్ల త్రాగి చల్లబడ్డాడు. నయం ఇంకా ఆ నీళ్ళకు కరువు రాలేదు.

కత్తి చేత్తో పట్టుకొని, తడిపిన గుడ్డ పీలిక ఒకటి తలమీదుగా కప్పుకొని వడివడిగా బయటికి నడిచాడు.

❊ ❊ ❊

రామయ్య విచారంగాకూర్చున్నాడు. ఆయన భార్యకూడా చింతతోటే వున్నది. కారణం రంగచచ్చిపోయింది.

దీర్ఘంగా ఆలోచిస్తున్నాడు రామయ్య బరువెక్కిన గుండెతో.

రంగ ఎంత చక్కని ఎద్దు! ఎంత చురుకుగా పని చేసేది! అది ఏనాడైతే పుట్టిందో అప్పటినుండి తన సిరి పలికింది. దాని తల్లి ఆవు ఏ కామధేనువు అంశాన్నో పుట్టింది. రోజుకు ఎన్ని పాలిచ్చేది! అది వున్నప్పుడు ఇంట్లో లక్ష్మి వున్నట్టే అనిపించేది. చక్కని లేగల్ని, దూడల్ని ప్రసాదించింది. అది వున్నప్పుడు దొడ్లనిండా పశువులే-ఇంటినిండా ధాన్యమే-పట్టిందల్లా బంగారంలా వుండేది. తర్వాత అది ముసల్ది అయింది. ఆయుష్షుమూడి చచ్చిపోయింది. అది ప్రసాదించినవే ఈ రంగ, మంగలు. ఊరికంతటికి వస్తాదుల్లాంటి బసవన్నలు. చక్కటి జోడి. అందులోంచి ఇప్పుడు రంగ లేదు.

"మంగ"కేసి చూశాడు రామయ్య. అదీ విచారంగా కూర్చునట్టనిపించింది.

దరిద్రంలోమునిగిపోతున్నట్టుఫీలయ్యాడు. రంగ కళ్ళముందు మెదుల్తున్నట్టే వున్నది. ఉత్సాహంగా రంకె వేస్తున్నట్టనిపించింది. ప్రాణం పీకుతున్నది.

ఉండలేకపోయాడు రామయ్య. చేతి కర్ర తీసుకుని బయటికి నడిచాడు. ఊరి బయటికి బయలుదేరాడు.

శ్మశానందాటి మైదానంలో అడుగుపెట్టాడు.

దూరాన - పది గజాల దూరాన రంగ నిర్జీవంగా శరీరం తూట్లుగా కన్పిస్తున్నది. ఎర్రటి మాంసం అగుపడుతున్నది బయటికి. దాన్ని ఎవడో - కాదు, మాదిగ జగ్గడు కత్తితో కోస్తున్నాడు. కొంచం, కొంచంగా ఎద్దుకుళ్ళినట్టయి కొద్దిగా దుర్వాసన వేస్తున్నది.

తన రంగను........అనుకుంటూ! అది చూసిన రామయ్యలో మౌఢ్యం వెర్రితలలు వేసింది. వికృతంగా హుంకరించాడు. తననే చర్మం ఒలుస్తున్నట్టుగా కోస్తున్నట్టుగా బాధ. కోపం, చేతి కర్రను బిగించి పట్టుకున్నాడు. ఒక్క పరుగున వెళ్ళి జగ్గడి వీపుమీద కొట్టాడు బలంగా, చండాలపు లంజాకొడుకా, రాక్షసముండా కొడుకా అంటూ అరుస్తూ-

"బాబోయ్"! అంటూ వెనక్కి తిరిగి కత్తిని వదిలాడు జగ్గడు. ఎద్దును కోయడం ఆపి.

బండ బూతులు తిడుతూ అలానే కర్రతో బాదనారంభించాడు రామయ్య.

భయంతో, బాధతో నోటమాటరాక ఒకటే పరుగులంకించుకున్నాడు అక్కడ్నుంచి జగ్గడు.

నా రంగా అంటూ విలపించాడు ఎద్దును చూస్తూ రామయ్య.

❊ ❊ ❊

గుడిసె ముందు, అరుగుమీద జగ్గడు. ఆకలి బాధతో, దెబ్బలబాధతో స్పృహలేకుండా పడి వున్నాడు. నరకం అంటే ఇంకేదో వేరేలేదనీ తెలుసుకున్నాడు.

వాడి, పిల్లలు, పెంట కుప్పలమీద చింతగింజల కోసం ప్రయత్నించి, తిరిగి తిరిగి వడదెబ్బ తాకినట్టుగా పడిపోయివున్నారు. వీపు కంటిన కడుపులతో.

ఝుయ్‌మంటూ సుడిగాలి వీచింది ఉదృతంగా. తాటాకులు గుడిసె మీదివి. చాలా వరకు లేచి ఎగిరి పోయినై.

ఇప్పుడు అవి యథాస్థానంలో పెట్టబడలేవు.

చంటిది కేరుమంది కీచుగా. లచ్చిలేవలేదు. ఇప్పుడేకాదు, ఎప్పుడూ లేవలేదు.

నిశ్చలంగా, స్థిరంగావున్న ఆ తోలుకప్పిన అస్థి పంజరం ఇప్పుడు నిర్జీవం.

కొంత సేపటికి చంటిదాని ఏడుపూ ఆగిపోయింది శాశ్వతంగా-

మృత్యువు, క్షమానికి- ప్రకృతికి కృతజ్ఞత చెప్పింది.

కాలపురుషుడు వికటంగా నవ్వాడు. ఝుయ్‌మంటూ వడగాలి.

ఝుయ్‌మంటూ సుడిగాలి.

ఆకాశంలో కెగిరిన దుమ్ము.

❊ ❊ ❊

మైదానంలో చచ్చిన ఎద్దు - రామయ్యగారి రంగ అనవసరంగా అవతల పారవేయబడి, వ్యర్థంగా కుళ్ళి కంపు కొడుతూ ఏ మానవుడికీ ఉపయోగపడకుండా ఆ ప్రదేశమంతా కంపు వ్యాపింపజేస్తూ-

ఆ దిక్కు మాలిన, పనికి మాలిన పక్షులకు రాబందులకు-రాక్షసుల్లాంటి రాబందులకు ప్రీతిమైన ఆహారమై ఆకలి తీరుస్తున్నది.

రాబందుల సంఖ్య పెరిగింది. ఎద్దును తూట్లుగా పొడుస్తూ హాయిగా తింటున్నాయి.

ఉద్యోగం

పెళ్ళికొడుకు తల్లి : మా అబ్బాయికి కాలు వంకా? చెయ్యి వంకా?
పెళ్ళికూతురి తల్లి : అవ్వన్నా మంచిదే. ఉద్యోగమయినా వస్తుంది.

—పి. శ్రీరామచంద్రమూర్తి




ఆత్మరక్షణ ప్రతి మానవుని జన్మహక్కు —గాంధీ